● మూడేళ్ల వరకు నిర్వహణకు నిధులు
● మండలానికి 100 ఎకరాల లక్ష్యం
● సబ్సిడీపై డ్రిప్ సౌకర్యం

మద్దూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ ద్వారా పండ్ల తోటల పెంపకానికి చేయూత నిస్తుండటంతో రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. దీర్ఘకాలికంగా ఆదాయాన్నిచ్చే మామిడి, సీతాఫల్, మునగ, జామ, బత్తాయి, మల్బరీ తోటల పెంపకానికి ఉపాధి హామీని అనుసంధానించినట్లు ఉద్యాన శాఖ అధికారులు 2024-25 ఆర్థిక సంవత్సరంలో మండలానికి 100 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. అంతేకాకుండా పండ్ల తోటల పెంపకానికి డ్రిప్ పరికరాలను ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు పూర్తి సబ్సిడీపై, ఇతరులకు 10 శాతం రాయితీపై అందిస్తున్నారు.

151 ఎకరాల్లో పండ్ల తోటలు

మద్దూరు, దూళిమిట్ట మండలాల్లోని 23 గ్రామాల్లో సుమారు 50 మంది రైతులు పండ్ల తోటలకు దరఖాస్తు చేసుకున్నారు. మద్దూరు మండలంలో 38 మంది రైతులు 110 ఎకరాల్లో మామిడి, మునగ, మల్బరీ సాగు చేయగా, దూళిమిట్ట మండలంలో 41 ఎకరాల్లో 12 మంది రైతులు సాగు చేశారు.

నిర్వహణకు నిధులు

పండ్ల తోటలను ఏర్పాటు చేసుకున్న చిన్న, సన్నకారు రైతులకు మూడేళ్ల వరకు తోటల నిర్వహణకు ఉపాధి హామీ ద్వారా నిధులు అందిస్తోంది. ఒక్కో మొక్కకు రూ.30 అందిస్తుండగా నాటడానికి గుంత తీసినందుకు రూ.228, మొక్క నాటినందుకు రూ.46.24, రెండుమీటర్ల కర్ర నాటడానికి రూ.17.36 ఇవ్వనున్నారు. మొక్కలకు ఎరువులనందించేందుకు ఆరు మాసాలకోసారి ఒక్కో మొక్కకు రూ.25 చొప్పున ఏడాదిలో రెండుమార్లు నిధులు మంజూరవుతాయి. ఒక్కో మొక్క నిర్వహణకు నెలకు రూ.12.24 ఇవ్వనుంది. నెలకు రూ.3వేలు మించకుండా నిధులను మంజూరు చేస్తున్నట్లు ఉపాధిహామీ అధికారులు తెలిపారు.



లద్నూరులో అంతరపంటగా సాగు చేసిన బొబ్బెర



ఉపాధిహామీ చిన్న, సన్నకారు రైతులకు వరం

రెండెకరాల్లో మామిడి తోటను పెంచుతున్నాను. తోటల పెంపకంతో దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరనుంది. ఉపాధిహామీతో చిన్న, సన్నకారు రైతులకు వరంగా మారింది. పంట చేతికందే వరకు నిర్వహణకు నిధులు మంజూరు చేస్తుండటంతో ఆర్థికంగా చేయూత అందుతుంది.

- పూట్ల రవీందర్‌రెడ్డి, ధర్మారం, రైతు

కాపు చేతికందే వరకు అంతర పంట సాగు చేస్తున్నా



మూడెకరాల్లో మామిడి మొక్కలు నాటుకున్నాం. కాపుకు వచ్చే వరకు అంతర పంటగా బొబ్బెర, మినుములు సాగు చేసుకున్నాం. ఉపాధిహామీ రైతులకు ప్రయోజనంగా ఉంది.

- బేజాడి పద్మ, లద్నూరు, రైతు

నెలాఖరులోపు దరఖాస్తు చేసుకోవాలి



నీటి వసతి కలిగి ఐదెకరాలలోపు ఉన్న చిన్న,సన్నకారు రైతులు ఈనెల 30లోపు గ్రామ పంచాయతీలో పండ్ల తోటలకు జాబ్‌కార్డు, కలిగి పట్టాదారుపాసు పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్ ప్రతులతో దరఖాస్తు ఇవ్వాల్సి ఉంటుంది. గ్రామసభలో చేసిన తీర్మానం ప్రతిని అధికారులకు పంపించి మంజూరుకు కృషి చేస్తాం. దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీలకు పూర్తి సబ్సిడీతో పాటు బీసీ, ఓసీలకు 10 శాతం రాయితీతో డ్రిప్ సౌకర్యం మంజూరవుతుంది.

- పర్శరాములు, ఈసీ, మద్దూరు

కాంగ్రెస్ ప్రభుత్వానిది రాక్షసానందం

● అధికారం కట్టబెట్టింది ఆటంబాంబులు పేల్చడానికేనా?
● శాసనమండలి ప్రతిపక్ష నేత, మాజీ స్పీకర్ మధుసూదనాచారి

చేర్యాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అలవిగాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, తెలంగాణ సమాజంలో భయానక వాతావరణం సృష్టించి సీఎం రేవంత్‌రెడ్డి రాక్షసానందం పొందుతున్నారని శాసనమండలి ప్రతిపక్షనేత, మాజీ స్పీకర్, సిరికొండ మధుసూదనాచారి అన్నారు. చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో వీరబ్రహ్మం, మహమ్మాయి ఆలయాల నిర్మాణ భూమి పూజకు హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడారు. త్వరలో ఆటంబాంబు పేలుతుందని మంత్రి పొంగులేటి అనడం సబబు కాదని, ప్రజలు అధికారం కట్టబెట్టింది బాంబులు పేల్చి విధ్వంసం సృష్టించడానికా.. అని ఎద్దేవా చేశారు. సమైక్య పాలనలో తెలంగాణ ప్రాంతానికి చేకూర్చిన అన్యాయంపై పోరాడి స్వరాష్ట్రాన్ని సాధించిన మాజీ సీఎం కేసీఆర్ తన కార్యదక్షతతో తెలంగాణను ఆదర్శంగా తీర్చిదిద్దారన్నారు. సమైక్యాంధ్ర పాలనలో రక్తం కారని రోజులేదని, కానీ బీఆర్ఎస్ హయాంలో ఎక్కడా విధ్వంసానికి, అరాచకాలకు తావివ్వకుండా ప్రజలకు రక్షణగా నిలవడంతో పాటు అభివృద్ధికి చిరునామాగా మార్చారని పేర్కొన్నారు. ప్రతిపక్షాల పట్ల సీఎం రేవంత్‌రెడ్డి అనుసరిస్తున్న పదజాలం బాగులేదన్నారు. ఆత్మ పరిశీలన చేసుకుని ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రియల్‌ఎస్టేట్ రంగాన్ని నిర్వీర్యం చేయడంతో పాటు హైదరాబాద్‌లో పరిశ్రమలు కొనసాగించే పరిస్థితి లేకుండా చేశారన్నారు. దేవుళ్ల పేరిట ప్రమాణాలు చేయడమే తప్పా సీఎం రేవంత్‌రెడ్డి రైతుబంధు, పెన్షన్లు, రుణమాఫీ, నిరుద్యోగభృతి వంటివి అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. ప్రజలకు గులాబీ జెండాతోనే మంచి జరుగుతుందని, కాంగ్రెస్ నయవంచన పాలనకు చరమగీతం తప్పదన్నారు. ఆయన వెంట నాయకులు ఉల్లెంగల ఏకానందం, సుంకరి మల్లేశం తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మధుసూదనాచారి

మౌలాలి నుంచి నర్సాపూర్‌కు తప్పిపోయి వచ్చిన విద్యార్థి

● తల్లిదండ్రులకు అప్పగించిన అగ్నిమాపక సిబ్బంది

నర్సాపూర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని తన ఇంటి నుంచి స్కూల్ కోసం బయలుదేరిన విద్యార్థి నర్సాపూర్‌కు చేరుకుని తిరుగుతుండగా, అగ్నిమాపక సిబ్బంది గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకున్నది. అగ్నిమాపక సిబ్బంది కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని మౌలాలికి చెందిన పదో తరగతి విద్యార్థి గురువారం ఇంటి నుంచి స్కూల్ కోసం బయటకు వచ్చి, స్కూల్‌కు వెళ్లకుండా తప్పిపోయి నర్సాపూర్‌కు చేరుకున్నాడు. సాయంత్రం వేళ అగ్నిమాపక కేంద్రం వద్ద ఓ బాలుడు తిరుగుతుంటే సిబ్బంది అనుమానం వచ్చిన సిబ్బంది రమేష్ అతడి వద్దకు వెళ్లి వివరాలను కనుక్కున్నారు. ఇక్కడకు ఎలా వచ్చానో తెలియదని సమాచారం ఇచ్చి తన వివరాలను తెలిపాడు. తప్పిపోయి వచ్చి ఉంటాడని భావించి అతడిని అగ్నిమాపక కేంద్రం వద్ద ఉంచుకుని రాత్రిభోజనం పెట్టి బాలుడి తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. తల్లిదండ్రులు హుటాహుటిన రాత్రి 11 గంటల సమయంలో నర్సాపూర్‌కు చేరుకుని బాలుడిని తీసుకెళ్లారు. బాలుడి తల్లిదండ్రులు రమేష్, ఇతర అగ్నిమాపక సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



తండ్రికి బాలుడిని అప్పగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

క్రైం కార్నర్

డీసీఎం ఢీకొని ఒకరి మృతి



తలారి కిష్టయ్య(ఫైల్)

జోగిపేట, నవంబరు8 (ఆంధ్రజ్యోతి) : డీసీఎం ఢీ కొట్టడంతో ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని అల్మాయి పేట వద్ద చోటుచేసుకున్నది. జోగిపేట ఎస్ఐ పాండు కథనం ప్రకారం.. మండలంలోని నాదులాపూర్ గ్రామానికి చెందిన తలారి కిష్టయ్య(52) నేషనల్ హైవే కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం అల్మాయిపేట శివారులోని బసనాగుల బ్రిడ్జి వద్ద హైవేపై పనిచేస్తుండగా వేగంగా వస్తున్న డీసీఎం కిష్టయ్యను ఢీ కొట్టగా మృతి చెందాడు. ఘటనస్థలానికి చేరుకున్న ఎస్ఐ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం జోగిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పాతకక్షతో మహిళ హత్య

● ముగ్గురి రిమాండ్



హత్య వివరాలు తెలుపుతున్న సీఐ

నర్సాపూర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పాతకక్షలతో పాటు తన పరువు పోయేలా ప్రచారం చేస్తున్న మహిళను అడ్డుతొలగించుకోవాలని మరో ఇద్దరి సహాయంతో ఓ మహిళ హత్య చేయించింది. నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం.. సెప్టెంబరు 11న నర్సాపూర్ మండలం ఎల్లరెడ్డిగూడెం తండాకు చెంది శాంతబాయి(45) అదృశ్యమైనట్లు కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టగా మూడురోజుల క్రితం గుమ్మడిదల మండలం నల్లవల్లి అటవీప్రాంతంలో గుర్తుతెలియని మహిళ శవం లభ్యమైనట్లు అక్కడి పోలీసుల ఆధారంగా నర్సాపూర్ పోలీసులు తెలుసుకున్నారు. ఆ మృతదేహం అదృశ్యమైన శాంతగా గుర్తించి దర్యాప్తు చేపట్టారు. అదే తండాకు చెందిన అరుణతో, శాంతకు పాతకక్షలు ఉన్నాయి. కల్లుదుకాణంలో పరిచయం ఉన్న కొండాపూర్‌కు చెందిన శ్రీనివాస్, వెంకటయ్యను అరుణ సంప్రదించి విషయం చెప్పి హతమారిస్తే శాంత ఒంటిపై ఉన్న నగలతో పాటు అదనంగా డబ్బు ఇస్తానని చెప్పి ఒప్పించింది. శాంతబాయి నర్సాపూర్‌కు కూరగాయాలు విక్రయించడానికి వెళ్లగా ఆమెకు మాయ మాటలు చెప్పడంతో ఒకే తండాపైగా స్నేహితురాలని నమ్మి నలుగురు కలిసి కల్లుదుకాణానికి వెళ్లి కల్లు తాగారు. ఆ తర్వాత వారు శాంతను గుమ్మడిదల మండలం నల్లవల్లి అటవీప్రాంతానికి తీసుకెళ్లి చీర కొంగుతో ఉరివేసి చంపేశారు. విచారణలో హత్య చేసినట్లు ఒప్పుకున్నందున ముగ్గురిని శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

కులగణనను పకడ్బందీగా నిర్వహించాలి

● ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి, రాష్ట్ర ఆర్అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన

గజ్వేల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సామాజిక, ఆర్థిక, రాజకీయ కుల గణనను పకడ్బందీగా నిర్వహించాలని ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేకాధికారి, రాష్ట్ర ఆర్అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన అన్నారు. గజ్వేల్ -ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఆయా అంశాలను గూర్చి ఎన్యూమరేటర్లను అడిగి తెలుసుకున్న ఆమె ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. ఆమె వెంట కలెక్టర్ మనుచౌదరి, ఆర్డీవో వీవీఎల్ చంద్రకళ, తహసీల్దారు శ్రావణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్య ఆర్ఐ కృష్ణ, ఎన్యూమరేటర్, సూపర్‌వైజర్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.



గజ్వేల్‌లో సర్వే తీరును పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి హరిచందన, కలెక్టర్ మనుచౌదరి

రామచంద్రాపూర్‌లో పరిశీలన

కుకునూరుపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపూర్ గ్రామంలో శుక్రవారం కలెక్టర్ మనుచౌదరితో కలిసి ప్రత్యేకాధికారి హరిచందన సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామంలో అధికారులను అడిగి సర్వే తీరును తెలుసుకున్నారు. అధికారులు ఆమెకు సమాధానం ఇస్తూ గ్రామంలో 98 గృహాలకుగాను 119 కుటుంబాలను గుర్తించామని, హైదరాబాద్‌లో ఉన్నవారి వివరాలు నేరుగా ఫోన్ ద్వారా లేక కుటుంబసభ్యులను అడిగి తెలుసుకుంటున్నామన్నారు. ఆమె వెంట గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, ఎమ్మార్వో మల్లికార్జున్‌రెడ్డి, ఆర్ఐ, పంచాయతీ కార్యదర్శి నాగరాజు ఉన్నారు.

ధాన్యం కొనుగోలులో ఇబ్బందులకు గురి చేయవద్దు

చేర్యాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీసవసతులు కల్పించాలని, త్వరితగతిన కొనుగోలు చేపట్టి రైతాంగాన్ని ఇబ్బందులకు గురిచేయకుండా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేకాధికారి హరిచందన అన్నారు. కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాల గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ మను చౌదరితో కలిసి పరిశీలించారు. కొనుగోలుకేంద్రంలోని ధాన్యం రాశులు, ప్యాడీ క్లీనర్లు, గన్నీ సంచులు నిల్వను పరిశీలించారు. ధాన్యం తేమశాతం యంత్రాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన ధాన్యం నిర్ణీత తేమశాతం వచ్చిన వెంటనే తూకంపెట్టి మిల్లులకు తరలించాలని తెలిపారు. రైతుల వివరాలు ట్యాబ్ ఎంట్రీలో సత్వరం నమోదు చేసి త్వరితగతిన ధాన్యం డబ్బు ఖాతాలలో జమయ్యేలా చూడాలన్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా టార్పాలిన్లు సిద్ధంగా పెట్టాలని, తాగునీరు తదితర వసతులు విధిగా కల్పించి రైతులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

గురువులు కరువు

ఆంధ్రజ్యోతి విజిట్

ఐదో పేజీ తరువాయి

వస్తోంది. శుక్రవారం ఉమ్మడి మెదక్ జిల్లాలోని పలు పాఠశాలల్లో ఆంధ్రజ్యోతి పరిశీలించగా పలు విషయాలు వెలుగు చూశాయి.

విద్యార్థులు ఎక్కువ.. టీచర్లు తక్కువ

విద్యార్థులకు తగినట్లుగా ఉపాధ్యాయుల నియామకం ఉండాలిని విద్యాశాఖ నిబంధనలు సూచిస్తున్నాయి. కానీ విద్యార్థుల సంఖ్యకు తగినట్లుగా ఇవి కానరావడం లేదు. ఉమ్మడి జిల్లాలో ఇలాంటి పాఠశాలలు అనేకం ఉన్నాయి. ఉదాహరణగా ఈ పాఠశాలలను పరిశీలిస్తే..



అల్లాదుర్గం మండలం రాంపూర్‌లోని ప్రాథమికోన్నత పాఠశాలలో 8 తరగతుల్లోని 80 మంది విద్యార్థులతో ప్రార్థన చేయిస్తున్న ఒకే ఉపాధ్యాయుడు

● చేగుంట మండల కేంద్రంలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో 81 మంది విద్యార్థులకు ఇద్దరు టీచర్లు మాత్రమే ఉన్నారు.
● అల్లాదుర్గం మండలం అప్పాజీపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఇద్దరే ఉపాధ్యాయులు ఉన్నారు. గత ఏడాది 61 మంది విద్యార్థులు ఉండగా ఉపాధ్యాయుల కొరత వల్ల ఆ సంఖ్య నేడు 48కి పడిపోయింది.
● గుమ్మడిదల మండలంలోని ప్రాథమిక పాఠశాలలో 200 మంది విద్యార్థులకు కేవలం ఆరుగురు టీచర్లు మాత్రమే ఉన్నారు. మరో ఇద్దరు అవసరం.
● బెజ్జంకి మండలంలోని నర్సింహులపల్లి ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి వరకు 25 మంది విద్యార్థులు మాత్రమే ఉండగా వీరందరికీ ఒకే ఉపాధ్యాయురాలు ఒక్క గదిలోనే పాఠాలు చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఈ స్కూళ్లలో రివర్స్..

ఉపాధ్యాయుల నియామకంలో సరైన విధానాలను అవలంబించకపోవడం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అనుగుణంగా కాకుండా రకరకాల కోణాల్లో ఈ నియామకాలు ఉన్నట్లుగా అర్థమవుతున్నాయి. ఈ కింది పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంటే ఉపాధ్యాయులు అంతకుమించి ఉండడమే నిదర్శనం.

● రామాయంపేట పట్టణంలోని అమ్మోరుగడ్డ ప్రాథమిక పాఠశాలలో 56 మంది విద్యార్థులకు నలుగురు టీచర్లు ఉన్నారు.
● అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 101 మంది విద్యార్థులకు 9 మంది టీచర్లు పాఠాలు చెబుతున్నారు.
● సదాశివపేట మండలం నిజాంపూర్ మార్కండేయనగర్ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో 21 మందికి ఏడుగురు విద్యార్థులే హాజరయ్యారు. ఇక్కడ ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా హాజరు కావడంతో గదికి తాళం వేశారు.
● కంది మండలంలోని చిమ్నాపూర్ ప్రాథమిక పాఠశాలలో 29 మంది విద్యార్థులకుగాను ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నారు.
● నారాయణరావుపేట మండలం ఏదుల్లవాడ ప్రాథమిక పాఠశాలలో కేవలం 13 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు.
● మిరుదొడ్డి మండలం ధర్మారం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 70 మంది విద్యార్థులకు ఆరుగురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు.



ఝరాసంగం మండలం భోజ్యానాయక్ తండాలో ఉపాధ్యాయులు లేక పాఠశాలకు తాళం

పరిష్కారానికి అనేక మార్గాలు

విద్యార్థుల సంఖ్యతోపాటు పాఠశాలల పరిస్థితులను సైతం పరిగణనలోకి తీసుకొని ఉపాధ్యాయుల నియామకం చేపట్టాల్సిన అవసరం విద్యాశాఖ అధికారులపై ఉంటుంది. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంటే సమీపంలో ఉన్న మరో స్కూల్‌లో విలీనం చేసి సదరు ఉపాధ్యాయుల సేవలు వాడుకోవాలి. లేదంటే ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉంటే వారిని ఇతర పాఠశాలలకు అడ్జస్ట్ చేస్తూ ఆర్డర్లు ఇవ్వాలి. ఫలితంగా విద్యార్థులకు సరైన ప్రాధాన్యత దక్కుతుంది. ఈ విషయంపై విద్యాశాఖ అధికారులకు పూర్తి అవగాహన ఉన్నప్పటికీ ఆచరణలో మాత్రం జాప్యం జరుగుతోంది.

శిథిలావస్థలో పశు ఆరోగ్య ఉపకేంద్రం

- 25 ఏళ్ల క్రితం నిర్మాణం
- ఎప్పుడు కూలుతుందోనని ఆందోళన చెందుతున్న సిబ్బంది
- పట్టించుకోని అధికారులు, నాయకులు


బీటలు వారి పిచ్చి మొక్కలు మొలిచిన పశు ఆరోగ్య ఉపకేంద్రం

సిద్దిపేట రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): 25ఏళ్ల క్రితం నిర్మించిన పశు ఆరోగ్య ఉప కేంద్ర భవనం శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతుంది. దీంతో సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడులోని దుస్థితి ఇది. పశువులకు, మూగ జీవాలకు మెరుగైన వైద్యమందించాలనే ఉద్దేశంతో 25 ఏళ్ల క్రితం అప్పటి సిద్దిపేట ఎమ్మెల్యే కేసీఆర్ పశు ఆరోగ్య ఉప కేంద్రాని మంజూరు చేయించారు.

వైద్యానికి తీసుకువచ్చేవారూ అంతంతే..

ఇర్కోడు పశుఆరోగ్య ఉపకేంద్రం పరిధిలో పశువులు-685, గేదెలు-945, గొర్రెలు- 7156, మేకలు-2134, శునకాలు-118, నాటు కోళ్లు-3245 వరకు ఉన్నాయి. ఈ పశు ఆరోగ్య ఉప కేంద్రానికి గతంలో రైతులు భారీగా తరలి వచ్చేవారు. కానీ ప్రస్తుతం కనీస వసతులు లేక పోవడం, శిథిలావస్థకు చేరుకోవడంతో రైతులు పశువులను తీసుకురావడం మానేశారు. ఉపకేంద్రంలో ప్రస్తుతం జూనియర్ వెటర్నరీ అధికారి, ఆఫీస్ సబార్డినెట్, మహిళా సిబ్బంది సేవలు అందిస్తున్నారు.

ఎప్పుడు కూలుతుందో తెలియని దుస్థితి

సుమారు సుమారు 25 ఏళ్ల క్రితం నిర్మించిన పశు ఆరోగ్య ఉపకేంద్రం శిథిలావస్థకు చేరడంతో సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో ఉప కేంద్రంలో నిల్వచేసిన మందులు తడిసిపోయినట్లు తెలిసింది. శిథిలావస్థకు చేరిన పశువుల అనుపత్రికి నూతన భవనం మంజూరు చేయాలని గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. గ్రామంలోని కీలక నేతలు గత ప్రభుత్వంలో పని చేసినా పశు ఆరోగ్య ఉపకేంద్రానికి నూతన భవనం మంజూరు చేయించడంలో విఫలమయ్యారని విమర్శిస్తున్నారు. నూతన భవనం మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

భవనం నిర్మాణం చేపట్టాలి

మూగజీవాలకు చికిత్స అందించేందుకు, మందులు నిల్వ చేసేందకు సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. ఉన్నతాధికారులు, నాయకులు స్పందించి నూతన భవనం మంజూరు చేసి ఇబ్బందులు తొలగించాలి.

\- మారెడ్డి మధుసూదన్‌రెడ్డి, రైతు సంఘాల నాయకులు,ఇర్కోడు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

వర్షం వస్తే ఇబ్బందులు ఎదురవుతున్న విషయం వాస్తవమే. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. పశు ఆరోగ్య ఉప కేంద్ర భవనం శిథిలావస్థలకు చేరిందని, నూతన భవనం నిర్మాణం చేపట్టాలని ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

\- తారా, జూనియర్ వెటర్నరీ అధికారి

ట్రాలీ ఆటో ఢీకొని విద్యార్థినికి తీవ్రగాయాలు

గజ్వేల్ రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ట్రాలీ ఆటో ఢీకొని విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. కుకునూరుపల్లి మండలం తిప్పారానికి చెందిన శ్రీనివాస్, కవిత దంపతులు కూతురుతో కలిసి గజ్వేల్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో నివాసం ఉంటూ వాచ్‌మెన్‌గా పని చేస్తున్నారు. వైష్ణవి(8) తండ్రితో సైకిల్‌పై పాఠశాలకు వెళ్తున్న క్రమంలో వెనక నుంచి ట్రాలీ ఆటో ఢీకొనడంతో విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలు

కోహెడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఈనెల తొమ్మిది, పదో తేదీన నూతన ఓటర్ నమోదు కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ సురేఖ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో బీఎల్‌వోలు వారి వారి పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటారని ఆమె తెలిపారు. 2025 జనవరి ఒకటి వరకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ నూతన ఓటరుగా ఫామ్ 6 ద్వారా నమోదు చేసుకోవాలని, ఓటర్ గుర్తింపు కార్డులో ఏవైనా సవరణలు ఉంటే ఫామ్ 8 ద్వారా అర్జీలు సమర్పించాలని కోరారు.

సీఎం జన్మదిన వేడుకలు

సీఎం రేవంత్‌రెడ్డి పుట్టినరోజును నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలల్లో, చౌరస్తాల్లో కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు.

\- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



సిద్దిపేట రూరల్: నారాయణరావుపేటలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ


హుస్నాబాద్: సీఎం జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న జిల్లా గ్రంథాలయ చైర్మన్ లింగమూర్తి


చేర్యాల: కొమురవెల్లి మల్లన్న ఆలయ రాజగోపుర ప్రాంగణంలో పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

గత ప్రభుత్వ చొరవతోనే చేర్యాలకు మున్సిఫ్‌కోర్టు

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): చేర్యాల ప్రాంత ప్రజల ఇబ్బందులు తీర్చేందుకు మాజీ సీఎం కేసీఆర్ చొరవ వల్లే బీఆర్ఎస్ హయాంలోనే చేర్యాలకు మున్సిఫ్‌కోర్టు మంజూరు చేశారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. చేర్యాల మండలంలో శుక్రవారం ఆయన పర్యటించిన సందర్భంగా పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కోర్టు మంజూరుచేసి భవనాన్ని కూడా కేటాయించిందని, సిబ్బంది నియామకానికి సంబంధించి జీవో వెలువరిచేలోగా అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటికీ తాను కోర్టు విషయాన్ని విస్మరించకుండా సంబంధిత అధికారులతో సంప్రదింపులు కొనసాగించానన్నారు. కొద్దిరోజుల క్రితం సిద్దిపేట జిల్లా సమీక్షా సమావేశంలోనూ ప్రస్తావించినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి 27మందిని నియమించడం పట్ల కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు. త్వరితగతిన నియమించి కోర్టుసేవలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.


మృతుడి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పల్లా

పరామర్శ ..

వాహనాన్ని వానరం ఢీ కొట్టిన సంఘటనలో చేర్యాల మండలం వేచరేణికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి పర్పాటకం ధర్మారెడ్డి మృతి చెందడం పట్ల ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేస్తూ శుక్రవారం మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఆయనవెంట మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్, కౌన్సిలర్ మంగోలు చంటి, నాయకులు తదితరులున్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలి

- ఏవో రామకృష్ణ

మద్దూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి బి. రామకృష్ణ సూచించారు. మండల కేంద్రంలోని బియ్య సిద్దులు సాగు చేసిన ఆయిల్‌పామ్ పంటను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడారు. అయిల్‌పామ్ సాగు ద్వారా అధిక లాభాలు సాధించవచ్చని తెలిపారు. మూడేళ్ల అనంతరం 30 ఏళ్ల వరకు ప్రతి నెల రెండు కోతలతో అధికాదాయం లభిస్తుందని తెలిపారు. ఆయిల్‌పామ్ పంట సాగు చేసే రైతులు 90 శాతం సబ్సిడీ అవకాశం పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో రాజుతో పాటు రైతులు పాల్గొన్నారు.

- కుకునూరుపల్లి: చిన్నకృష్ణాపూర్‌లో జిల్లా ఏరువాక శాస్త్రవేత్త పల్లవి, వ్యవసాయ అధికారి గోవిందరాజు వరిపంటను పరిశీలించారు. పంట వేసే ముందు రైతులు జీవన ఎరువులు వాడి నేలలో ఉన్న ఎరువులను పంటలను అందే విధంగా చూసుకోవాలని తెలిపారు. అనంతరం గ్రామంలోని రైతు కమ్మిలి మల్లేశం పండిస్తున్న అతి సన్న వారి గింజ రకం ఆర్ఎన్ఆర్ 31479 పంటను కూడా పరిశీలించారు. తినడానికి ఈ ధాన్యం బాగుంటుందని, మార్కెట్‌లో చాలా డిమాండ్ ఉందని తెలిపారు.


మద్దూరులో రైతు సిద్దులు ఆయిల్‌పామ్ పంటను పరిశీలిస్తున్న ఏవో రామకృష్ణ

గంజాయి విక్రేత అరెస్టు

జహీరాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పస్తాపూర్‌లో ఉన్న ఓ వెంచర్ సమీపంలో మహారాష్ట్రకు చెందిన రహ్మత్అహ్మద్ తన ద్విచక్రవాహనంపై, ఎండు గంజాయిని జహీరాబాద్‌కు విక్రయించేందుకు తీసుకువస్తున్న క్రమంలో గురువారం రాత్రి పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపారు. వారి కథనం ప్రకారం... పస్తాపూర్ సమీపంలోని ఓ వెంచర్ వద్ద వాహనాల తనఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ఏపీ23-ఏఫ్2722 నెంబరుగల ద్విచక్రవాహనంపై వస్తున్న అతడిని తనిఖీ చేయగా గంజాయి పట్టుబడిందన్నారు. అతడు కర్ణాటకలోని బీదర్ నుంచి తరచూ గంజాయిని తీసుకువచ్చి జహీరాబాద్ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తుంటాడన్నారు. అతడ్ని అదుపులోకి తీసుకుని కిలోన్నర గంజాయి, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ తనిఖీల్లో సీఐ. గాంధీనాయక్, ఎస్ఐ.యాదయ్య తదితరులున్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు రూ.26 వేల వేతనం ఇవ్వాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి



ఎంఈవో కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

గజ్వేల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్లకు రూ.26వేల వేతనం, గ్రాట్యూటీ ఇవ్వాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ టీచర్లు శుక్రవారం సీఐటీయూలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, గోపాలస్వామి ఆధ్వర్యంలో చేరారు. ఈ సందర్భంగా అంగన్వాడీ జిల్లా కార్యదర్శి ఎం.పద్మతో కలసి వారు మాట్లాడుతూ.. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీ టీచర్లకు జీతాలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. వారితో అంగన్వాడీ టీచర్లు స్వప్న, వనజ, ఉమా, మంజుల, నిర్మల, సంధ్య, సుమలత, రజిని, లక్ష్మీ, రమ, పద్మ తదితరులున్నారు.


గజ్వేల్‌లో మాట్లాడుతున్న గోపాలస్వామి

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు..

బెజ్జంకి: చాలీచాలని వేతనాలతో మధ్యాహ్న భోజన కార్మికులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మీసం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మండలం కేంద్రంలోని ఏంఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కార్యాలయ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా రూ.10 వేల జీతం ఇస్తానన్న వాగ్దానాన్ని ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ, డ్రెస్‌కోడ్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి. ప్రియాంక


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రియాంక

గజ్వేల్ రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ ప్రియాంక పేర్కొన్నారు. జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా శుక్రవారం కొడకండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. విద్యార్థులు, ప్రజలు చట్టాలపై అవగాహన ఉండటం ఎంతో అవసరమని అన్నారు. న్యాయసేవలు అందించేందుకు న్యాయ సేవాధికార సంస్థ చట్టాల గురించి అవగాహన కల్పించడంతో పాటు బాధితులకు నష్టపరిహారం అందించేలా కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీశైలం, జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు దేశబోయిని నర్సింహులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఫైలేరియా వ్యాధిగ్రస్థులు ఎంతమంది

- డబ్ల్యూహెచ్‌వో సీజనల్ వ్యాధుల రాష్ట్ర పర్యవేక్షణ అధికారి శిరీష


ఆస్పత్రికి వచ్చిన వారితో మాట్లాడుతున్న శిరీష

కుకునూరుపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఫైలేరియా వ్యాధిగ్రస్థులు ఎంతమంది ఉన్నారని, వారికి ఇస్తున్న పెన్షన్, మందుల వివరాలను డబ్ల్యూహెచ్‌వో సీజనల్ వ్యాధుల రాష్ట్ర పర్యవేక్షణ అధికారి శిరీష అడిగి తెలుసుకున్నారు. కుకునూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫైలేరియా కిట్లను వ్యాధిగ్రస్థులకు అందిస్తున్నారా, ఆరోగ్య కేంద్ర పరిధిలో ఎన్ని కేసులు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోగులతో మాట్లాడుతూ.. ఆస్పత్రిలో మందులు అందరికీ అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసకన్నారు. ఆమె వెంట వైద్యాధికారి పర్వీన్ ఉన్నారు.

డిగ్రీ కాలేజీలో డీఆర్సీ మీటింగ్



సమావేశంలో డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్

సిద్దిపేట కల్చరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా మానవ వనరుల కేంద్రం (డీఆర్సీ) సమావేశం ప్రిన్సిపాల్ సునీత అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. సిద్దిపేట జిల్లాలోని డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొని విద్యార్థుల అడ్మిషన్లు, ఉపకార వేతనాల సమస్యలు, హాస్టల్ విద్యార్థుల ఇబ్బందులను చర్చించారు. కళాశాలల్లో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకునేలా పరిశోధనలపై పట్టు సాధించేలా విద్యార్థులకు విద్యనందించాలని సమావేశంలో తీర్మానించారు.

ఆర్యవైశ్య సంఘం కొమురవెల్లి మండల కమిటీ ఎన్నిక

చేర్యాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య మహాసభ కొమురవెల్లి మండల కమిటీ నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం వాసవీసత్రంలో ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా ఉప్పల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా అంబటిపల్లి నాగరాజు, కార్యదర్శిగా చింతకింది మల్లయ్య, యూత్ అధ్యక్షుడిగా అంబటిపల్లి ఈశ్వర్ ఎన్నికయ్యారు. ఆర్యవైశ్యులు ఎదుర్కుంటున్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తూ సంఘం బలోపేతానికి పాటుపడతామని ఎన్నికైన వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

'అన్ని వర్గాల మద్దతుతో పోరాటం'



మాట్లాడుతున్న రామగల్ల పరమేశ్వర్

చేర్యాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): లక్ష్య సాధనకోసం అన్నివర్గాల మద్దతుతో పోరాడతామని జేఏసీ చైర్మన్ రామగల్ల పరమేశ్వర్ పేర్కొన్నారు. పట్టణంలోని జేఏసీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. చేర్యాల ప్రజల ఆకాంక్ష మేరకు ప్రభుత్వం రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం సోషల్ మీడియా కో-ఆర్డినేటర్లు దాసరి శ్రీకాంత్, కర్క తిరుపతిరెడ్డి, బంగారు ప్రేమ్‌కుమార్, ప్రైవేటు విద్యాసంస్థల సమన్వయకర్తలుగా మన్నె సత్యవర్ధన్, గోపు ఆరోగ్యరెడ్డి, తౌట రామాంజనేయులు, మట్ట దేవేందర్‌రెడ్డి, ఉద్యమకారుల కో-ఆర్డినేటర్లుగా అంబటి అంజయ్య, ఎండీ జహురుదీన్, అడ్వకేట్స్ కోఆర్డినేటర్లుగా భూమిగారి మనోహర్, ఆరెల్ల వీరమల్లయ్య పొన్నం సురేశ్ తదితరులను ఎన్నుకున్నారు.

విద్యారంగ సమస్యల పట్ల నిర్లక్ష్యం వద్దు

- టీపీటీఎఫ్ నాయకులు


సభ్యత్వ నమోదు చేస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

సిద్దిపేట కల్చరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమగ్ర సర్వే కోసం కేవలం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను ఉపయోగించుకోవడం సరికాదని టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు తిరుపతిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు విజయేందర్ రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం సభ్యత్వ నమోదు, పాఠశాలలో నెలకొన్న సమస్యలపై వివరాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వే మధ్యాహ్నం సమయంలో కాకుండా ఉదయం పూట కొనసాగించాలని సూచించారు. దివ్యాంగులకు, అనారోగ్య సమస్యలున్నవారికి సర్వే నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, జిల్లా, మండల నాయకులు శ్రీనివాస్, రాజు, బాల్‌రాజు, రామదాసు, ఎమ్. రాజు, రాంరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మనీషా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో పడకేసిన పారిశుధ్యం


ఆసుపత్రిలో పడేసిన పేపర్ ప్లేట్లు

గజ్వేల్ రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ప్రభుత్వాసుపత్రిలో పారిశుధ్యం పడకేసింది. ఎక్కడి చెత్త అక్కడే ఉండటంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీరోజు దవాఖానకు భారీ సంఖ్యలో ఓపీ నిమిత్తం, ఐపీ నిమిత్తం రోగులు వచ్చి పోతుండగా, ఆసుపత్రిలో దుర్వాసన భరించలేకపోతున్నామని ఆరోపిస్తున్నారు. ఆసుపత్రి గదుల వద్దనే పేపర్‌ప్లేట్స్, పాలిథిన్ కవర్లు, వాడిన మాస్కులు వేయడంతో అపరిశుభ్రతకు నిలయంగా మారింది. గతంలో పారిశుధ్య నిర్వహణలో రాష్ట్రంలోనే నెంబర్-2 ఆసుపత్రిగా నిలిచిన ప్రభుత్వాసుపత్రి ప్రస్తుతం అపరిశుభ్రంగా దర్శనమిస్తుంది. ఇటు పారిశుధ్యం, అటు మందుల లేమి పట్ల అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

- గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి



రికార్డులను తనిఖీ చేస్తున్న ఏసీపీ

కుకునూరుపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దొంగతనాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి సూచించారు. కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా పలు రికార్డులను పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కూడళ్ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్‌ని ఏర్పాటు చేయాలని, తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాల్లో బారికేట్లు ఏర్పాటు చేయాలని పోలీసులకు సూచించారు. సైబర్‌నేరాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను

సిద్దిపేట రూరల్,నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మానవ తప్పిదం వల్లే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను అన్నారు. సిద్దిపేట రూరల్ మండలం పెద్దలింగారెడ్డిపల్లిలో గురువారం రాత్రి పోలీసు కళాబృందంతో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరాలు జరిగితే వెంటనే 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ అపూర్వరెడ్డి, పోలీసు సిబ్బంది, కళాబృందం సభ్యులు రవి, రవీందర్, ఎల్లయ్య, తిరుమల, భార్గవి తదితరులు పాలల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మద్దూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నేడు 33కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులు దృష్ట్యా మండలంలోని రేబర్తి, మద్దూరు మర్మాములలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఇన్‌చార్జి విద్యుత్ ఏఈ మధు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు త్రీఫేజ్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

- సిద్దిపేట అర్బన్: సిద్దిపేట అర్బన్ మండలంలోని నాంచార్‌పల్లి, ఎన్సాన్‌పల్లి, బక్రీచెప్యాల సబ్‌స్టేషన్‌లకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.
- బెజ్జంకి: బెజ్జంకి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు మండలంలోని తోటపల్లి, దాచారం, దేవక్కపల్లి, వీరాపూర్ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏడీఈ సుధీర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు.
- చిన్నకోడూరు: మండలంలోని పెద్దకోడూరు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చిన్నకోడూరు, పెద్దకోడూరు గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ సిద్దిపేట రూరల్ ఏడీఈ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు.